క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ గాంధీబొమ్మ రోడ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు భవానీపురం బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, గాంధి బొమ్మ రోడ్, చర్చి రోడ్, కోళ్ల ఫారం రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ



గుణదల(విజయవాడ తూర్పు): నూతన సంవత్సర వేడుకల్లో యువతను ఉర్రూతలూగించే దిశగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఐకా ఈవెంట్ ఆర్గనైజేషన్ సంస్థ సీఈఓ డి.జయదుర్గ అన్నారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్‌లో ఐకా న్యూ ఇయర్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జయదుర్గ మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీన మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో అట్టహాసంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో నాటు నాటు అంటూ పాడిన గాయకుడు రాహుల్ సిప్లి గంజ్ ఈ వేడుకలకు హాజరు కానున్నారని తెలిపారు. తన బృందంతో పాప్ సాంగ్స్ పాడి యువతను ఉర్రూతలూగిస్తారని పేర్కొన్నారు. అనంతరం న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్‌ను సింగర్ రాహుల్ సిప్లి గంజ్‌తో కలిసి ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మను ఆరాధించండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మార్గశిర మాసంలో గురువారం పూట దుర్గమ్మను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని యనమండ్ర ఉమాకాంత్ శర్మ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై శుక్రవారం మార్గశిర మాసం విశిష్టతపై ధార్మిక ప్రవచనం జరిగింది. మహాలక్ష్మీ అమ్మవారికి మార్గశిర మాసం ఎంతో ప్రీతిపాత్రమైనదని, మహాలక్ష్మీ స్వరూపమైన దుర్గమ్మను గురువారం నాడు ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని, లక్ష్మీ కటాక్షం కలిగి అన్ని సౌభాగ్యాలు సిద్ధిస్తాయన్నారు. అమ్మవారి ఆజ్ఞలు అనుసరిస్తూ ప్రతి ఒక్కరు జీవించాలని కోరారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

వించిపేట(విజయవాడపశ్చిమ): దళిత జాగృతి సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసాని గణేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం వించిపేటలోని సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో శాంతి సామరస్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాపులర్ షూమార్ట్ గ్రూప్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. ముందుగా సీఎస్ఐ చర్చి ఫాదర్ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 55, 50 డివిజన్ల కార్పొరేటర్‌లు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, బోయి సత్యబాబు, దళిత, క్రైస్తవ, మైనార్టీల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పేటేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ట



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్చారణలతో శుక్రవారం ఘనంగా జరిగింది. దాత ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, వెంకటరమణ దంపతుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేసి నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండే విధంగా నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసిన దాత కొండలరావును అభినందించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు 15 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులు పర్యవేక్షించారు.

ఇష్టంతో ముందుకు సాగితే అద్భుతాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఇష్టంతో గణితాన్ని అభ్యసిస్తే అద్భుతాలు సాధించవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యవేక్షణాధికారి పి. రవికుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల గణిత శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు చేపట్టిన జాతీయ గణితశాస్త్ర దినోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం జరిగిన ముగింపు సభకు పి. రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు భయంతో గణితానికి దూరమవుతున్నారన్నారు. గణితంపై మక్కువ పెంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల మ్యాథ్స్ టీచింగ్ మోడల్స్‌కి రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి లభించిందన్నారు. ఎస్ఆర్ఎస్వీ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ కనకదుర్గ మాట్లాడుతూ గణితం అన్ని శాస్త్రాల కన్నా ఉన్నతమైందన్నారు. ప్రముఖ గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రఖ్యా సత్యనారాయణశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వివిధ అంశాల్లో పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి పఠాన్ కల్మాబేగం, స్టాటిస్టిక్స్ అధ్యాపకులు శేషుబాబు, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె. రామకృష్ణ, షైన్ డైరెక్టర్ ఎన్. శ్రీహరి తదితరులు ప్రసంగించారు.

దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని, అందుకే ఆయన జయంతిని జాతీయ గణిత శాస్త్రజ్ఞుల దినోత్సవంగా జరుపుకుంటున్నారని డీఏఎస్ఎంసీ హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గణితానికి సంబంధించిన గుర్తులు (ప్లస్, మైనస్, ఇంటు, ఈక్వల్స్)తో విద్యార్థిని వేసిన ముగ్గు, అదే విధంగా గణిత మోడల్స్ ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకున్నాయి. గణితం ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ రాసుకున్న చిత్తు లెక్కలు, సమీకరణాల సూత్రాలతో రూపొందించిన 'రామానుజ గణితం' పుస్తకాన్ని విద్యార్థులకు అందజేశారు.

ఎన్నో శాస్త్రాలకు మూలం గణితమే..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్నో శాస్త్రాలకు మూలం గణిత శాస్త్రమేనని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి, అకడమిక్స్ డీన్ డాక్టర్ దుర్గాప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కేబీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న రవికుమార్



విజేతలకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ



గణిత ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న ఉపాధ్యాయులు

సృజనాత్మకత వెలికి తీసేందుకు ప్రదర్శనలు

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్, మాథ్స్ ప్రదర్శనలు దోహదపడతాయని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కార్యదర్శి కేఎల్వీ మోహనరావు అన్నారు. పాఠశాల ఆవరణలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఏర్పాటుచేసిన గణిత శాస్త్ర నమూనాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలోని సీనియర్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుని శ్రీరాం ఇందిరను గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

కూరపాటిలో..

పాతబస్తీలోని కూరపాటి చంద్రశేఖరరావు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గణిత వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

29న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి సమావేశం ఈ నెల 29వ తేదీన జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని పరిపాలనా భవనంలో నిర్వహించే ఈ సమావేశంలో రానున్న భవానీ దీక్షల ఏర్పాట్లు, సాధారణ పరిపాలనా అంశాలు చర్చకు రానున్నాయి. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈవో కేఎస్ రామారావులతో పాటు ఆలయ ముఖ్య విభాగాల అధికారులు హాజరు కానున్నారు.

బీసీ జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు అనుగుణంగా వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని పలువురు బీసీ నేతలు కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వతంత్ర పోరాట రథయాత్ర పేరుతో శుక్రవారం సాయంత్రం చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి గుడిలో అమ్మవారి దర్శనం అనంతరం బీసీల రాజ్యాధికార రథయాత్రను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో వెంగళరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వెంగళరావు మాట్లాడుతూ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రథయాత్ర ముగింపు కార్యక్రమం తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరుగుతుందన్నారు. సంఘం ఏపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన హోమగుండం నిర్మాణ పనులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే భవానీ దీక్ష విరమణకు అవసరమైన హోమగుండం నిర్మాణ పనులను శుక్రవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహా మండపం వద్ద ఏర్పాటు చేసే హోమగుండ పనులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆలయ స్థానాచార్య శివప్రసాద్‌శర్మ పూజాది కార్యక్రమాలను జరిపించారు. దీక్ష విరమణలను పురస్కరించుకుని ఏటా దేవస్థానం మహా మండపం ఎదుట రెండు, మహా మండపం దక్షణం వైపున మరో హోమ గుండాన్ని ఏర్పాటు చేస్తోంది. అదే రీతితో ఈ ఏడాది కూడా మూడు హోమగుండాలను ఏర్పాటు చేసేందుకు దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్. రమాదేవి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా చిన్న లడ్డూ పంపిణీ..

దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు ఇకపై చిన్న లడ్డూను ఉచితంగా అందచేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద శుక్రవారం ఉచిత లడ్డూ పంపిణీని చైర్మన్ కర్నాటి రాంబాబు లాంఛనంగా ప్రారంభించారు. తొలి రోజున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లడ్డూలను భక్తులకు పంపిణీ చేస్తున్నామని, శనివారం నుంచి ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రంలో లడ్డూలను భక్తులకు అందజేస్తామన్నారు.



హోమగుండం పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైర్మన్ రాంబాబు

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులతో పాటు అయ్యప్పలు, స్వాములు, భవానీలు తరలివచ్చారు. శబరిమలై యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారు కొందరయితే, ఇరుముడిని ధరించి శబరిమలైకు వెళ్తూ అమ్మవారిని దర్శించుకునేందుకు మరి కొంత మంది స్వాములు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలు నిర్వహించగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నిక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కామాక్షీ స్వర్ణకార సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కేశనం భావన్నారాయణ, మందరపు పోతులూరి ఆచారి ఎన్నికయ్యారు. సంఘం సర్వసభ్య సమావేశం పాతబస్తీలోని మాడపాటి సోషల్ క్లబ్ ఆవరణలో శుక్రవారం జరిగింది. వీరితో పాటు సంఘం కోశాధికారిగా షేక్ సలీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కటకం మోహన్ మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాళాబత్తుల భాస్కరరావు, వర్కింగ్ కోశాధికారిగా అవ్వారు శ్రీనివాసరావు (బుల్లెబ్బాయి), గౌరవాధ్యక్షులుగా తాళాబత్తుల అప్పలాచారి, చల్లపల్లి మోహనరావులు ఎన్నికయ్యారు. సమావేశంలో సభ్యులందరూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భావన్నారాయణ, పోతులూరి ఆచారి మాట్లాడుతూ దాదాపు 200 ముంది అర్హత గల స్వర్ణకార కార్మికులకు ముద్ర లోన్ పథకం కింద 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను ఆర్థిక రుణంగా ఇప్పించామని తెలిపారు. భవిష్యత్తులో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు అర్హతగల స్వర్ణకారులందరికీ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. స్వర్ణకార సంఘం పెద్దలు అందే వరదయ్య, లక్కోజు బ్రహ్మం, గోలి వెంకటేశ్వరరావు, యంగళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

రామవరప్పాడు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన 'మాదక ద్రవ్యాలు– సోషల్ మీడియా దుర్వినియోగంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. ప్రస్తుతం అవగాహన లోపంతో విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు బానిసగా మారుస్తుందన్నారు. ఈ వ్యవసనాల ప్రభావంతో తమ వ్యక్తిత్వం కోల్పోవడంతో పాటు సమాజంలో చులకనకు గురవుతారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని డి ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, నవజీవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి.విజయరాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు రజిత, ముబీనా బేగం, లలిత, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోళ్లమూడి శేఖర్ బాబు

నేడు చినకంచిలో ఉత్తరద్వార దర్శనం

నున్న(విజయవాడరూరల్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం చినకంచిలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటలకు ఉత్తరద్వార దర్శనం, 8గంటలకు లక్షతులసీ పూజ, 9 గంటలకు ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఆదివారం రాత్రి 7గంటలకు శ్రీస్వామినాథస్వామి వారి కల్యాణోత్సవం, 25వ తేదీ ఉదయం వసంతోత్సవం, పూర్ణాహూతి, అభిషేకార్చనలు అనంతరం అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు.

దుర్గగుడిలో మహిళా సెక్యూరిటీ గార్డు చేతివాటం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తురాలు అమ్మవారికి సమర్పించిన చీర విషయంలో చేతివాటం ప్రదర్శించిన సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించారు. అమ్మవారికి ఇచ్చిన చీరను తన బ్యాగ్‌లో పెట్టుకున్న మహిళా సెక్యూరిటీ గార్డు వ్యవహారం దుర్గగుడిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాజాగా శుక్రవారం సెక్యూరిటీ అధికారులు ఆ గార్డుపై చర్యలు తీసుకున్నారు.

ఏం జరిగిందంటే..

20వ తేదీన రూ. 300 క్యూలైన్‌లో దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలు అమ్మవారికి చీరను సమర్పించాలని నిర్ణయించుకుంది. అయితే అమ్మవారి బంగారు వాకిలి వద్ద విధులు నిర్వర్తిస్తున్న మహిళా సెక్యూరిటీ గార్డుకు ఆ భక్తురాలు చీరను ఇచ్చి అమ్మవారి వద్ద ఉంచాలని కోరింది. అయితే చీరను అమ్మవారికి చూపిన తర్వాత బయటకు ఇవ్వడంతో ఆ చీరను ఆ గార్డు తన బ్యాగ్‌లో పెట్టుకోవడం చీరల కాంట్రాక్టర్ సిబ్బంది గమనించారు. ఈ వ్యవహారం గురించి సెక్యూరిటీ ఎస్ఓకి ఫిర్యాదు చేయడంతో గార్డు బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో చీర ఉండటంతో వెంటనే విధుల నుంచి తప్పించారు. అయితే ఆలయ విధుల నుంచి తొలగించిన సెక్యూరిటీ అధికారులు, ఆ మహిళకు మరో చోట విధులు కేటాయించినట్లు సమాచారం.

భర్త వేదింపులపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తమ్ముడిపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని భార్యను వేదింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట రామాలయం ప్రాంతానికి చెందిన సింగపల్లి కిరణ్‌కుమారి, రాంప్రసాద్ భార్యభర్తలు. కిరణ్‌కుమారి నగర పాలక సంస్థ మలేరియా విభాగంలో ద్వాక్రా కార్మికురాలు. కొద్ది కాలం కిందట కిరణ్‌కుమార్‌పై మరిది సింగపల్లి జగ పూర్ణ దుర్గారావు అత్యాచారం యత్నం చేయబోగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని రాంప్రసాద్ తరుచూ కిరణ్‌కుమారిని వేదింపులకు గురి చేయసాగాడు. భర్త వేదింపులు భరించలేక కిరణ్‌కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన వారు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి, తప్పక పాటించాలని డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. పురేంద్ర అన్నారు. బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్‌మాల్‌లో రెడ్‌ఎఫ్‌ఎం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆటో ఎక్స్‌పోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇలాంటి ఎక్స్‌పోలు ఉపయోగపడతాయన్నారు. ఈ ఎక్స్‌పోలో బైక్స్, స్కూటర్స్, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించారు. ప్రోగ్రామ్‌హెడ్ ఆదిల్‌బాషా, క్రాంతికుమార్, సుధాకర్, మాల్ ఇన్‌చార్జి జగన్ పాల్గొన్నారు.

బాలిరెడ్డి ఆలోచనా విధానం అద్భుతం



మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి ఆలోచనా విధానం ఈ ప్రాంతానికి ప్రాణం పోసిందని న్యూఢిల్లీ ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీఐఎస్ఎస్–2023 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి లకిరెడ్డి బాలిరెడ్డి చేసిన కృషి తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఇంజినీర్‌లుగా తీర్చిదిద్దారన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆలోచనా విధానం కలిగి ఉండాలన్నారు. యూనివర్సిటీ ఆఫ్ బఫెల్లో, అమెరికా వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ వేణుగోవిందరాజులు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఆస్ట్రేలియా టీసీఎస్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ సైబర్ రిసీలియన్స్ ప్రాధాన్యం వివరించారు. సదస్సులో ప్రొఫెసర్ ప్రదీప్ కే దాస్, డాక్టర్ వై.విజయలత, డాక్టర్ ఈ శ్రీనివాస రెడ్డి, లకిరెడ్డి ప్రసాదరెడ్డి, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు.

పేదల జీవితాల్లో వెలుగు నింపిన సీఎం

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్ జగన్ మరలా ముఖ్యమంత్రి కావాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని 162వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. స్వాతి సెంటర్, ప్రెసిడెంట్ వీధుల్లో తిరిగారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో గెట్ గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పేదల ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత పేదలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, ఇషాక్, జోసెఫ్, లాజర్, ఆనంద్, కుమార్, బాజీ, రసూల్ ఖాన్, శివమణి, వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భవానీపురం 162వ సచివాలయంలో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన గౌస్ మొహిద్దీన్

అన్ని వర్గాలకు అండగా సీఎం జగన్

జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 167వ సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి పాల్గొని కార్పొరేటర్ బుల్లా విజయ్‌తో కలసి పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మనోజ్ కోఠారి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, గత చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక పథకంతో లబ్ధిపొందిన వారు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వారంతా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలబడి ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బడుగు అప్పారావు, బెజ్జం విజయలక్ష్మి, కె.లక్ష్మీప్రసన్న, బిరుడకంటి అప్పారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



167వ సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మనోజ్ కోఠారి, విజయ్‌కుమార్

ఏఎన్ఎంలకు బీపీ మిషన్లు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధి సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు క్యాపో సొసైటీ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ బీపీ మిషన్లు శుక్రవారం అందజేశారు. సచివాలయం ఏఎన్ఎంల వద్ద బీపీ మిషన్ల కొరత ఉందని దయాసాగర్‌ను కోరగా తక్షణమే స్పందించిన ఆయన ఎలక్ట్రానిక్ బీపీ మిషన్లు సమకూర్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ విజయకుమార్ చేతుల మీదుగా మిషన్లు అందజేశారు. దాతల సహకారం సద్వినియోగం చేసుకుని ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపర్చాలని డాక్టర్ విజయకుమార్ కోరారు.



ఏఎన్ఎంలకు ఎలక్ట్రానిక్ బీపీ మిషన్లు అందజేస్తున్న దయాసాగర్, డాక్టర్ విజయకుమార్

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ 7వ లైన్‌కు చెందిన పిళ్లా నాగశ్యామల, ఆనంద్‌కుమార్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. ఆనంద్‌కుమార్ తన బంధువైన రాంగోపాల్‌తో కలిసి సిగరెట్ల హోల్‌సేల్ వ్యాపారం చేశాడు. అయితే వ్యాపారంలో నష్టం రావడంతో కొద్ది రోజులుగా మానసికంగా కుంగిపోసాగాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆనంద్‌కుమార్ కనిపించడం లేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.